క్లుప్తంగా

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్త్రీశ్వరాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈవో శ్యామల రఘునాథరెడ్డి, అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయ కుమార్ శర్మ(పవన్)లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక అలంకరణలు, పూజలు జరుగుతాయన్నారు. హోమాల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయం వద్ద తమ వివరాలు, గోత్రనామాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

రేపటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు జరగనున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు ఉంటాయి. 24 నుంచి 26వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న వాలీబాల్, అథ్లెటిక్స్, 25న కబడ్డీ, ఖోఖో, 26న యోగా, చెస్, బ్యాడ్మింటన్‌లో ఎంపికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. అండర్ – 14 విభాగంలోని వారు 2011 జనవరి ఒకటి తరువాత, అండర్ –17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2008 జనవరి ఒకటి తరువాత జన్మించిన ఉంటేనే అర్హులని వెల్లడించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు నడింపాలెంలో 'స్వచ్ఛతా హీ సేవ' ర్యాలీ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని నడింపాలెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై సోమవారం అవగాహన కల్పించడంతోపాటు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటరులో జరుగుతున్న వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని గ్రామస్తులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

భావి తరాలకు కర్ణాటక సంగీతం అందించడమే లక్ష్యం



గాత్ర సంగీత పోటీల్లో ఓ విద్యార్థిని

నగరంపాలెం: భావి తరాలకు సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని అందించడమే లక్ష్యమని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ మందిరంలో ఆదివారం కర్ణాటక గాత్ర సంగీత పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ హాజరై, తమ ప్రతిభను చాటారు. వచ్చే నెలలో రెండో విడత పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలు అని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా సాయిశృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ప్రేమకుమార్, శ్రీభారతి సంగీత నిలయం అధ్యక్షురాలు భారతీదేవి, సంగీత కళాశాల ఉపాధ్యాయులు బి.సురేష్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గిరిజా శంకర్, కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.

చిన్నారుల పెద్ద మనస్సు



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని అయ్యప్ప రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో చిన్నారులు దాతృత్వం చాటారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తల్లిదండ్రుల నుంచి సేకరించిన రూ.21,534లను తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు ఆదివారం ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో చలమయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అయ్యప్ప రెసిడెన్సీ వాసులు నాగధర్, సుహాస్, శ్రీనిధి, పావని, రితిక, దాశరథి విఘ్నేశ్వర్, నిత్య, దినేష్, ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ల సత్యం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటా శేషగిరి పాల్గొన్నారు.

వాహనాలు శిథిలం.. నిర్లక్ష్యం పదిలం!



సమీపంలోని సీసీ రోడ్డుపై నెలలుగా ఉంచిన ఆటోలు



స్టేషను వెనుక ప్రైవేట్ ప్రదేశంలో..

ప్రత్తిపాడు పోలీసులు స్టేషను చుట్టుపక్కల ప్రాంతాలను ఆక్రమించేస్తున్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను సంవత్సరాల తరబడి అక్కడే ఉంచుతున్నారు. సమీంలోని పాఠశాలలో, వెనుకనున్న ప్రైవేట్ ప్రదేశంలో మరికొన్నింటిని పడేశారు. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు అవాంతరాలు తప్పడం లేదు. దీనికితోడు స్టేషనులోని వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్డు పక్కన నివాసాల మధ్య గుట్టలుగా పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. దీనికంతటికి కారకులే పోలీసులు కావడంతో వారి తీరును ప్రశ్నించలేక స్థానికులు మౌనంగా ఉంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ప్రత్తిపాడు



స్టేషను పక్కన బైకులు





ఎదురుగా ఉన్న పాఠశాలలో....

నీరు పుష్కలం.. నిర్వహణే శాపం

- నిండు కుండల్లా తాగునీటి వనరులు
- ప్రత్తిపాడు ప్రజలకు మాత్రం కష్టాలు
- ఐదు రోజులకోసారి అరకొర సరఫరా
- కలెక్టర్ పేరిట యంత్రాంగం నిర్లక్ష్యం

ఇది భగభగమండే వేసవి కాలం కాదు. ఇటీవల పుష్కలంగా వానలు కురిశాయి. చెరువులు నిండు కుండల్లా ఉన్నాయి. ప్రత్తిపాడు ప్రజలకు మాత్రం గుక్కెడు తాగునీరూ కరువైంది. రక్షిత మంచినీటి చెరువు జలకళతో తొణికిసలాడుతున్నప్పటికీ తడారిన గొంతులతో వారు కుళాయిల వంక ఆశగా రోజుల తరబడి చూడాల్సిన దుస్థితి. కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యపు అధికారుల తీరుతో ఈ అవస్థలు తప్పడం లేదు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు.. ఓ నియోజకవర్గ కేంద్రం. 13 వేల మంది జనాభాతో మేజర్ పంచాయతీ కూడా. ఇలాంటి చోట ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మూడు రక్షిత మంచినీటి చెరువులు, మూడు మంచినీటి ట్యాంకులు, మూడు ఫిల్టర్ బెడ్లు, ఒక మైక్రో ఫిల్టర్ ఉన్నాయి. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లుగా అధికారుల నిర్లక్ష్యంతో ప్రత్తిపాడు వాసులు దాహంతో అలమటించిపోతున్నారు. ఫిల్టర్ బెడ్లు పనిచేయడం లేదని, మైక్రో ఫిల్టర్ కెపాసిటీ చాలడం లేదని కుంటి సాకులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు ఐదురోజులకోసారి తాగు నీటిని కుళాయిల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్నారు. వాడుకునేందుకు కూడా నీరు లేక ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు.

రోజువారీ సరఫరాకు ఎగనామం..

ఇటీవల వర్షాలు కురిసి వరద నీరు చెరువులకు రావడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కచ్చితంగా ఫిల్టర్ చేసిన నీటినే సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇవే ఆదేశాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా పంచాయతీ అధికారులకు ఇచ్చారు. ఇదే అదనుగా ఫిల్టర్ బెడ్లు చెడిపోయాయి.. మైక్రో ఫిల్టర్ కెపాసిటీ రోజువారీ ఫిల్టర్ నీటిని అందించేంత లేదన్న సాకుతో రోజువారీ సరఫరాకు ఇక్కడి యంత్రాంగం మంగళం పాడింది. మొన్నటివరకు రెండు రోజులకు ఓ సారి తాగునీటిని సరఫరా చేసే అధికారులు కలెక్టర్ పేరు చెప్పి ఐదారు రోజులకోసారి ఇస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్.. ఇలా అందరు అధికారులు రోజూ నీటిని సరఫరా చేయాలని చెప్పినా పంచాయతీ అధికారులు పెడచెవిన పెడుతున్నారు.



ప్రత్తిపాడులో నిండుకుండలా రక్షిత నీటి చెరువు

కొరవడిన సమన్వయం

దీనిపై పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరాను వివరణ కోరగా.. రోజూ తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వాటర్ ఆపరేటర్ భాస్కర్‌ను అడగ్గా.. ఐదారు రోజులకోసారి ఇస్తున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌ను వివరణ కోరగా.. రోజూ ఫిల్టర్ నీటిని అందించాలని పంచాయతీ అధికారులకు సూచించామని, వారు సరఫరా చేయడం లేదని చెప్పారు. రోజూ సరఫరా చేసే సామర్థ్యం మైక్రో ఫిల్టర్‌కు ఉందని తెలిపారు. ప్రజలు మోటార్లు వాడకుండా సహకరిస్తే నీటిని రోజూ సరఫరా చేయవచ్చని చెప్పారు. ఇకనైనా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తాగునీరు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారడంతో ఫిల్టర్ బెడ్‌లో పెరిగిన మొక్కలు

తగిన సామర్థ్యం ఉన్నప్పటికీ..

ప్రత్తిపాడులో 1 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ ఉంది. ఇది 18 గంటలు పనిచేస్తే 10 లక్షల లీటర్ల నీటిని ఫిల్టర్ చేస్తుంది. అంతటి సామర్థ్యం ఉంది. అందులో రెండు లక్షల లీటర్లు నిరుపయోగమైనప్పటికీ రోజుకు 8 లక్షల లీటర్లు ఫిల్టర్ నీటిని ఉత్పత్తి చేయగలదు. ప్రత్తిపాడు జనాభా 13 వేలు. ఆర్‌డబ్ల్యూఎస్ లెక్కల ప్రకారం ప్రతి మనిషికీ 55 లీటర్లు తాగునీటిని రోజూ అందించాలి. ఈ లెక్కల ప్రకారం చూసుకుంటే ఉన్న ఒక్క మైక్రో ఫిల్టర్‌తో తాగునీటిని నిత్యం అందించే అవకాశం ఉంది. కొంతమంది మోటార్లు వేసుకున్నప్పటికీ నాలుగు నుంచి ఐదు లక్షల లీటర్లు సంప్‌లకు చేరే వీలు కూడా ఉంది. ఈ లెక్కన చూసుకున్నా రెండు రోజులకు ఓ సారి తాగునీటిని సరఫరా చేయవచ్చు. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు ఆలోచన చెయ్యకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



రోజుకు 10 లక్షల లీటర్ల శుద్ధ నీటిని అందించే సామర్థ్యం కలిగిన మైక్రో ఫిల్టర్

కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కార్యకర్తలకు అన్ని విధాలుగా, ఎల్లప్పుడూ అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యానికి గురైన మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన మురళిని ఆయన నివాసంలో మురళీకృష్ణ పరామర్శించారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పార్టీ మహిళా నాయకురాలు మండ్రు అనిత భర్త ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ చేబ్రోలు పవన్ కుమార్ తండ్రి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్ల, ఎంపీపీ భవనం పద్మలీల, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మురళీకృష్ణ

గమ్మత్తుగా యువత చిత్తు

- చేబ్రోలు పరిసర ప్రాంతాల్లో గుప్పుమంటున్న గంజాయి
- కార్మికులు, విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిసర ప్రాంతాల్లో గంజాయి గుప్పుమంటోంది...మత్తులో యువత చిత్తవుతూ.. భవితను నాశనం చేసుకుంటున్నారు. ప్రస్తుత సమాజంలో ఎంజాయ్ కోసం యువత గంజాయికి అలవాటు పడుతుంది. గతంలో సిగిరెట్, మద్యం సేవించటం ఫ్యాషన్‌గా ఫీలు అయ్యేవాళ్లు ఇప్పుడు రెండింటిని దాటి గంజాయికి అలవాటుపడుతున్నారు. ఎక్కువగా డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులే కాకుండా గ్రామాల్లో ఖాళీగా ఉండే యువకులు సైతం గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామల్లో గుట్టుగా గంజాయి దందా సాగుతోంది. గంజాయికి అలవాటు పడిన కొందరు ముఠాగా ఏర్పడి నిత్యం వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.

మండలంలో ఈ ఏడాది కేసులు..

- ఫిబ్రవరి 19వ తేదీన గంజాయి తరలిస్తున్న ఐదుగురిని చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రం నుంచి తీసుకువచ్చి చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు విక్రయించటానికి వస్తూ కొమ్మమూరు చానల్ బ్రిడ్జి వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఫజల్, యశ్వంత్, రమాకాంత్, అశీక్ కుమార్ పాండేలతో పాటు 17 సంవత్సరాల బాలుడు ఉన్నాడు.
- ఫిబ్రవరి 21వ తేదీన చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం వద్ద కిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలులోని లక్ష్మీ గోదావరి స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ, గురుశెట్టిలను పోలీసులు అరెస్ట్ చేశారు.
- వడ్లమూడి క్వారీ దేవస్థానం సమీపంలోని ప్రదాన రహదారి మార్గంలో సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- నారాకోడూరు గ్రామంలో గంజాయిని విక్రయిస్తున్న ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలు ఉప్పరపాలెంలో గంజాయిని నిల్వ చేసిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. ఇలా అనేక సంఘటనలు ఉన్నాయి.



చేబ్రోలులో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసిన దృశ్యం (ఫైల్)

పట్టించుకోని పోలీసులు..

నిషేధిత గంజాయిని అరికట్టాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో మండలంలోని చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించేవారు పెరిగిపోయారనే ఆరోపణలు వస్తున్నాయి. వందలాదిమంది యువకులు నిత్యం గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తుంది. విద్యార్థులు, కార్మికులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. మండల పరిధిలో ప్రధానంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. ఇతర జిల్లాల నుంచి యథేచ్ఛగా విచ్చలవిడిగా వస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా జోరుగా సాగుతోంది. ప్రత్యేక వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సులు, రైళ్లలో గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో సైతం తరలిస్తున్నారు.

అబాకస్ సాధనతో విద్యార్థులకు మేలు

గుంటూరు ఎడ్యుకేషన్: అబాకస్ సాధనతో విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చునని సిప్ అబాకస్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. అశోక్ నగర్‌లో సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శాఖను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా నగరంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కలరింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీసి, వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ధారణశక్తిని పెంపొందించడంలో అబాకస్ దోహదపడుతుందని అన్నారు. గణితంలో మంచి ప్రావీణ్యత సాధించేందుకు సులువైన పద్ధతుల్లో అబాకస్ అందిస్తున్నట్లు తెలిపారు. సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలతో పాటు భారతదేశంలోని 23 రాష్ట్రాల్లో 950 శాఖలతో ఐదువేల మంది ఉపాధ్యాయులతో అబాకస్ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా కలరింగ్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు హెడ్ మిల్కీ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



కలరింగ్ పోటీకి హాజరైన విద్యార్థులు

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై ఆదివారం సాయంత్రం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నమతీర్థల సిస్టర్స్ యుగళ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. త్యాగరాజ కీర్తనలతో పాటు పలు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. కచేరి సంగీతాభిమానులను అలరించింది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరక సురేష్‌బాబు వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని పరీక్షించి నిజాలు తేల్చాలి

గుంటూరు మెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం విషయంలో ప్రభుత్వం వెంటనే గతంలో తయారు చేసిన, ప్రస్తుతం తయారు చేస్తున్న లడ్డూలను పరీక్షల నిమిత్తం పంపించి పరీక్షలు చేయించాలని ఆల్ ఇండియా బ్రహ్మణ ఫెడరేషన్ ఈసీ మెంబర్ వెలవర్తిపాటి పాండురంగ విఠల్ డిమాండ్ చేశారు. పరీక్షలు చేయించి నిజాన్ని నిగ్గు తేల్చి ప్రజలకు నిజంగా లడ్డు తయారీలో కల్తీ జరిగిందా లేదా అనే విషయాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్పులు, కుట్టుమిషన్లు పంపిణీ

గుంటూరు మెడికల్: పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, ప్రతిభా కనపరిచిన 11 మంది విద్యార్థులకు రూ.1,10,000 స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. సుష్మ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లెడ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివప్రసాద్ గౌడ్, ప్రధాన కోశాధికారి జల్లెడ జయసుస్మితారావు గౌడ్ , కార్యదర్శి జల్లెడ సుష్మా రావు గౌడ్ , సహ కార్యదర్శి హరిత గౌడ్ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రాంగోపాల్ గౌడ్, గుంటూరు జిల్లా గౌడ్ సంఘ అధ్యక్షుడు తుళ్ళూరు శ్రీనివాసరావు, గీతా బంధు సేవా ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ వీరంకి రంగారావు, రాష్ట్ర గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టు ఫౌండర్ సెక్రటరీ బోబిళ్ళ వెంకటేశ్వరరావు, చైర్మన్ పామర్తి సాంబశివరావు, గౌడ సేవా ట్రస్టు అధ్యక్షుడు దాసరి వెంకట్రావు, గౌడ సేవా ట్రస్టు ఉపాధ్యక్షుడు చెన్ను శ్రీనివాసా కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్వచ్ఛతా హీ సేవ



గుంటూరు: జీజీహెచ్ నుంచి రోగి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలంటే వైద్యంతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జీజీహెచ్‌లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి గోడలకు రంగులు వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు. పరిశుభ్రం చేసేందుకు వలంటీర్లు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అడ్మిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.